# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 18-02-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ కృత్రిమ మేధ (ఏఐ) ప్రాంతీయ కేంద్రాన్ని రాష్ట్రంలో నెలకొల్పేందుకు చర్యలు తీసుకుంటున్నామని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు.
- ❖ రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాలకు ఉప కులపతులను నియమిస్తూ గవర్నర్ అబ్దుల్ నజీర్ ఉత్వర్వులు జారీ చేశారు.
- ❖ సృజనాత్మకత పెంపొందించేలా ప్రాధమిక స్థాయి నుండి ఉన్నత స్థాయి వరకూ పాఠ్య ప్రణాళికలో సమూల మార్పులు తీసుకుని వస్తున్నామని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు.
- ❖ రాష్ట్రాన్ని కరవురహితంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు.
- ❖ క్యాన్సర్ పట్ల ప్రతి ఒక్కరికీ ప్రాధమిక అవగాహన ఉండాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

==========================

దేశంలో ఏర్పాటు చేయనున్న 5 కృత్రిమ మేధ (ఏఐ) ప్రాంతీయ కేంద్రాలలో ఒకటి ఆంధ్రప్రదేశ్ లో నెలకొల్పేందుకు చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర పౌర విమానాయన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఈరోజు గుంటూరులో పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ… భవిష్యత్ అంతా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డీప్ టెక్నాలజీలదేనని అన్నారు. అదే విధంగా పౌరవిమానయాన రంగం విస్తరిస్తోందని తెలిపారు. చిన్న పట్టణాలలో కూడా విమానాశ్రయాలు ఏర్పాటు చేసే ఉడాన్ పథకాన్ని మరో 10 సంవత్సరాలకు కేంద్ర ప్రభుత్వం పొడిగించటం వల్ల రాష్ట్రానికి ఎంతో ఉపయోగకరమని కేంద్రమంత్రి అన్నారు. కాగా కేంద్ర బడ్జెట్‌లో మహిళలు, యువతకు అధిక ప్రాధాన్యత లభించిందని పేర్కొంటూ….

(వాయిస్ 32 సెకన్లు)

==========================

సృజనాత్మకత పెంపొందించేలా ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత స్థాయి వరకూ పాఠ్య ప్రణాళికలో సమూల మార్పులు తీసుకుని వస్తున్నామని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా ఉండవల్లిలోని ఆయన నివాసంలో సింఘానియా గ్రూప్ ప్రభుత్వ ప్రతినిధుల మధ్య ఈ రోజు అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... కళాశాల నుంచి బయటకు వచ్చే విద్యార్థికి వెంటనే ఉద్యోగం లభించేలా నైపుణ్యాలను అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. జాతీయ విద్యావిధానం లక్ష్యసాధనలో భాగంగా ప్రభుత్వం ఈ ఒప్పందం కుదుర్చుకుందని చెప్పారు.

==========================

రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాలకు ఉప కులపతులను నియమిస్తూ... గవర్నర్ అబ్దుల్ నజీర్ ఈ రోజు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీగా ప్రొఫెసర్ జి.పి. రాజశేఖర్, కాకినాడ జేఎన్టీయూ వీసీగా ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కె.ప్రసాద్, యోగి వేమన విశ్వవిద్యాలయం వీసీగా ప్రొఫెసర్‌గా పి.ప్రకాశ్‌బాబు నియమితులయ్యారు. అలాగే, రాయలసీమ విశ్వవిద్యాలయం వీసీగా వెంకట బసవరావు, అనంతపురం జేఎన్టీయూ వీసీగా హెచ్.సుదర్శనరావు, తిరుమల పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వీసీగా ఉమ, మచిలీపట్నం కృష్ణా విశ్వవిద్యాలయం వీసీగా కె.రాంజీ, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వీసీగా ప్రసన్న శ్రీ, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం వీసీగా అల్లం శ్రీనివాసరావు నియమితులయ్యారు. వీరంతా 3 సంవత్సరాల పాటు ఆయా వర్సిటీలకు వీసీగా కొనసాగనున్నారని అధికార వర్గాలు తెలిపాయి.

==========================

రాష్ట్రంలో వెనకబడిన ప్రాంతాలకు జల వనరులను అందించేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. రాజస్థాన్‌లోని ఉదయపూర్‌లో వాటర్ విజన్-2047 కింద వివిధ రాష్ట్రాల్లో నీటి సరఫరా నిల్వ నిర్వహణ అనే అంశంపై జల్ శక్తి మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న సమావేశంలో ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్ర జల విధానం ద్వారా రాయలసీమ ఉత్తరాంధ్ర వంటి ప్రాంతాలకు న్యాయం జరుగుతోందని చెప్పారు. రాష్ట్రాన్ని కరువు రహితంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉందని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 23 సెకన్లు)

==========================

ఢిల్లీలోని యశోభూమిలో రేపు జరిగే సౌత్ ఏషియా లీడింగ్ ట్రావెల్ అండ్ టూరిజం ఎగ్జిబిషన్-2025 ప్రారంభోత్సవంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పాల్గొననున్నారు. రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి ఉన్న వనరులు, అవకాశాలను ఆయన ఈ కార్యక్రమంలో వివరిస్తారు. పర్యాటక రంగంలో పెట్టుబడుల ఆకర్షణ లక్ష్యంగా మంత్రి ఢిల్లీ పర్యటన సాగనుందని అధికార వర్గాలు తెలిపాయి.

విరామం

==========================

రాష్ట్రంలో 18 సంవత్సరాలు దాటిన మహిళలందరికీ క్యాన్సర్ స్క్రీనింగ్ చేపట్టామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం ఏడుగుండ్లపాడులో ఈ రోజు నిర్వహించిన క్యాన్సర్ పై అవగాహనా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... క్యాన్సర్ ను ప్రాథమిక దశలో గుర్తించాలన్న దానిపై మహిళలకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. అవగాహన లోపంతోనే క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

==========================

రాష్ట్రంలో రెడ్ క్రాస్ సేవలను మరింత బలోపేతం చేయాలని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర శాఖకు నూతన ఛైర్మన్‌గా ఎన్నికైన వై.డి రామారావు, కోశాధికారి పి.రామచంద్ర రాజు, ప్రధాన కార్యదర్శి ఏకే పరిడా మర్యాదపూర్వకంగా రాజ్ భవన్‌లో గవర్నర్‌ని ఈ రోజు కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ... రాష్ట్రంలో 20 రెడ్ క్రాస్ రక్తనిధి కేంద్రాలలో ప్రజలకు నాణ్యమైన సేవలు అందుతున్నాయని అన్నారు. రాబోయే రోజుల్లో అన్ని రెడ్ క్రాస్ రక్తనిధి కేంద్రాలను ఆధునికీకరించి మరింత మెరుగైన సేవలను అందించాలని సూచించారు.

============================

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల శాసన మండలి ఎన్నికల విధులను పారదర్శకంగా సమర్ధవంతంగా నిర్వహించాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ పీఓలు, ఏపీఓలకు హితవు పలికారు. ఈనెల 27న జిల్లా వ్యాప్తంగా జరగనున్న ఎమ్మెల్సీ పోలింగ్ ప్రక్రియపై ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు తొలి విడత శిక్షణ తరగతులను ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో డిఆర్ఓ, డ్వామా పీడీతో కలిసి కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎమ్మెల్సీ ఎన్నికల కోసం నియమించబడిన పీఓలు, ఏపీఓలు ఎన్నికల ప్రక్రియను క్షుణ్ణంగా తెలుసుకోవాలని స్పష్టం చేశారు.

============================

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో 3 వేల మంది విద్యార్ధులకు ఈ విద్యా సంవత్సరం కంటి అద్దాలు పంపిణీ చేస్తున్నామని బాపట్ల జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. దీని కోసం రాష్ట్ర ప్రభుత్వం 7 లక్షల 50 వేల రూపాయలు మంజూరు చేసిందని చెప్పారు. బాపట్లలోని పురపాలక ఉన్నత పాఠశాలలో విద్యార్ధులకు కంటి అద్దాలను ఆయన ఈ రోజు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పాఠశాల విద్యార్ధులు దృష్టి లోపాలు రాకుండా చిన్నప్పటి నుండి పౌష్టిక హారం తీసుకోవాలని సూచించారు. మొబైల్స్ చూడడం, టీవీలు చూడడం తగ్గించి ఆటల పైన దృష్టి సారించాలన్నారు

============================

విశాఖపట్నంలో దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయ నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని భారతీయ జనతా పార్టీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు మంతెన మురళి పరశురామరాజు తెలిపారు. విశాఖ రైల్వే జోన్ ప్రధాన కార్యాలయ ప్రదేశాన్ని ఆయన ఈ రోజు సందర్శించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ.. నగరంలోని ముడసర్ల లోవ ప్రాంతంలో 54 ఎకరాల భూమిని రైల్వే జోన్ కోసం కేటాయించారని తెలిపారు. భూసార పరీక్షల నివేదిక తర్వాత భవన నిర్మాణం పనులు మొదలవుతాయని అన్నారు.

============================

జిల్లాలో రీసర్వే ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ సంబంధిత అధికారులను ఆదేశించారు. పార్వతీపురం నియోజకవర్గం బలిజిపేట మండలం శివరాంపురం గ్రామాన్ని ఆయన ఈరోజు సందర్శించారు. ఈ సందర్భంగా రీసర్వే ప్రక్రియలో ఎటువంటి తప్పిదాలకు తావులేకుండా చేపట్టాలని క్షేత్రస్థాయి సిబ్బందికి సూచనలు చేశారు.

============================

తిరుపతి జిల్లాలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణంతో ఈరోజు ప్రారంభమయ్యాయి. ఉదయం 8 గంటల 15 నిమిషాల నుండి 8 గంటల 40 నిమిషాల మధ్య మీనలగ్నంలో ధ్వజారోహణ ఘట్టంతో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరిగింది.

============================
============================